క్లుప్తంగా

వృద్ధాశ్రమానికి సరకుల వితరణ



వృద్ధాశ్రమానికి సరకులు అందజేస్తున్న చిన్నారులు, తల్లిదండ్రులు

మధురవాడ: స్థానిక హ్యాండ్స్ టు హెల్ప్ ఓల్డ్ ఏజ్ హోమ్‌లో నిరాశ్రయులకు ప్రజ్ఞ విద్యా సంస్థల విద్యార్థులు నిత్యావసర సరకులు అందజేశారు. ఇక్కడి వృద్ధులకు బియ్యం, పప్పులు, సబ్బులు, గోధుమ పిండి తదితర వస్తువులను డాక్టర్ ఫాజిల్ చేతుల మీదుగా అందజేశారు. విద్యాసంస్థల నిర్వాహకుడు పిళ్లా విజయ్‌కుమార్ మాట్లాడుతూ పిల్లలకు చిన్నప్పటి నుంచి సేవా కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. త్వరలో మెడికల్ క్యాంప్ వంటివి కూడా ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో కృష్ణపృథ్వి, చిన్ని వెంకట్, ఎంఎస్ఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణహిత కట్టడాలకు ప్రాధాన్యం



ప్రసంగిస్తున్న ఆర్కిటెక్ట్ చిత్ర విశ్వనాథన్

కొమ్మాది: భవన నిర్మాణ రంగంలో అనవసర వ్యయాన్ని తగ్గించడంతో పాటు సహజసిద్ధమైన నిర్మాణ సామగ్రిని ఉపయోగిస్తూ పర్యావరణ హిత కట్టడాలకు ప్రాధాన్యతనివ్వాలని బెంగళూరుకు చెందిన బయోమ్ ఎన్విరాన్‌మెంటల్ సొల్యూషన్స్ వ్యవస్థాపకురాలు, ఆర్కిటెక్ట్ చిత్ర విశ్వనాథన్ అన్నారు. గీతంలో నిర్వహించిన ఓ కార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడారు. భారత్ సహా నైజీరియా వంటి దేశాల్లో తాము దాదాపు 700 పైగా భవనాలను కేవలం మట్టితో నిర్మించామని తెలిపారు. దానివల్ల నిర్మాణ వ్యయం తగ్గడంతో పాటు పర్యావరణహిత కట్టడాలుగా అవి గుర్తింపు పొందాయన్నారు. ఇంటి నిర్మాణం జరిగే సమయంలో అక్కడ నేలతో పాటు నీటి వనరుల లభ్యత, గాలి, వెలుతురు వంటివి పరిగణనలోకి తీసుకుని నిర్మాణం చేపట్టడం వలన పర్యావరణానికి హాని కలగకుండా కట్టడాలు పూర్తి చేయవచ్చన్నారు.

మందుబాబులకు రూ.1.19 లక్షల జరిమానా

పీఎం పాలెం: మద్యం సేవించి ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వారికి న్యాయస్థానం రూ. 1 లక్షా 19 వేల రూపాయలు జరిమానా విధించిందని పీఎం పాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ విజయ్ తెలిపారు. ఇటీవల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కారుషెడ్, కొమ్మాది, మారికవలస కూడళ్లలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలలో మద్యం సేవించి ద్విచక్రవాహనం నడుపుతున్న 11 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. వారిని సోమవారం కోర్టులో హాజరుపరచగా ఒక్కొక్కరికీ రూ.10 వేలు నుంచి 12వేల 500 చొప్పున మొత్తం లక్షా 19వేల 500 రూపాయలు ఎక్సైజ్ కోర్టు జరిమానా విధించిందని ట్రాఫిక్ ఎస్ఐ తెలియజేశారు.

యువకుడు అదృశ్యం



పిల్లు సింగ్ (ఫైల్)

పీఎం పాలెం: యువకుడి అదృశ్యంపై పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. స్థానిక సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలివి.. బక్కన్నపాలెం కే-1 కాలనీ బ్లాక్ నంబరు1 జీఎఫ్-5లో దుదాని సులోచన సింగ్ కుటుంబంతో నివసిస్తున్నాడు. అతని కుమారుడు పిల్లు సింగ్ (30) ఈ నెల 17వ తేదీ మధ్యాహ్నం 2-30 గంటల సమయంలో ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. చుట్టుపక్కల వెదికినా ఫలితం లేకపోవడంతో పిల్లుసింగ్ తండ్రి సులోచన సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

- ఘనంగా బాబా జయంత్యుత్సవాలు
- కులమతాలకు అతీతంగా హాజరైన భక్తులు
- దర్బారులో భక్తిశ్రద్ధలతో దువా
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

జనసంద్రం.. తాజుద్దీన్‌బాబా ఆశ్రమం



చందల్‌కు ఎదురెళ్లి స్వాగతం పలుకుతున్న ఆశ్రమ వ్యవస్థాపకుడు తాజి రెడ్డిబాబా



దర్బారులో భక్తుల దువా



అలరించిన అమ్మవార్ల వేషాలు



ప్రత్యేక వాహనంపై బాబా చిత్రపటం ఊరేగింపు

తగరపువలస: భగవాన్ తాజుద్దీన్‌బాబా ఆశ్రమం సోమవారం జనసంద్రంగా మారింది. తాజుద్దీన్‌బాబా 164వ జయంత్యుత్సవాల్లో భాగంగా భీమిలి మండలం దాకమర్రి పంచాయతీ నీలయమ్మసత్రం కూడలిలోని బాబా ఆశ్రమ కూడలి భక్తులతో నిండిపోయింది. వేలాది మంది భక్తులకు ఆశ్రమ నిర్వాహకులు ఆదివారం నుంచి మూడు రోజుల పాటు అన్నప్రసాదాలు పంపిణీ చేస్తున్నారు. ఈ సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాలు, ఉత్తరాదిలోని నాగ్‌పూర్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, జార్ఖండ్, ఒడిశాకు చెందిన వేలాది మంది భక్తులు కులమతాలకు అతీతంగా బాబాకు మేళతాళాలు, బాణసంచా, నేలవేషాలు, కోలాటం, పులివేషాలు, తీన్‌మార్‌తో చందల్, చాదర్, గులాబీలు, అత్తరు తీసుకువచ్చి దర్బారులో దువా అర్పించారు. బాబా చిత్రపటాన్ని ప్రత్యేక రథంపై ఊరేగింపుగా తీసుకువెళ్లారు. ప్రధానంగా విజయనగరానికి చెందిన రొబ్బి హేమకుమార్, నాగ్‌పూర్‌కు చెందిన మహమ్మద్ షార్ఫుద్దీన్ తాజి, ఛత్తీస్‌గఢ్ డోంగర్‌గడ్‌కు చెందిన ఖాదర్‌వలీబాబా ఆశ్రమ నిర్వాహకులు సమర్పించిన చాదర్ ప్రత్యేకంగా నిలిచాయి. వీటికి ఆశ్రమ వ్యవస్థాపకుడు తాజి రెడ్డిబాబా ఎదురుగా వెళ్లి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా పలువురు ఆయన నుంచి ఆశీర్వచనాలు తీసుకున్నారు. ఆశ్రమం ఆవరణలో ఖవ్వాలీ ప్రదర్శించారు. జయంతి వేడుకలకు వచ్చిన భక్తులు దర్బారుతో పాటు బాబా ధ్వజానికి పూజలు చేసి ధునిలో సుగంధ ద్రవ్యాలు సమర్పించారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు.



తీర్థంలో ఏర్పాటు చేసిన స్టాల్స్

తీర్థంలో సందడి

ఆశ్రమం నుంచి జాతీయరహదారి వరకు మార్గాల్లో తీర్థం నిర్వహించారు. వివిధ వస్తువులు రూ.5 నుంచే లభించడంతో పాటు విలువైన వస్త్రాలు, అత్తరు లభించాయి. ఆ మార్గం సందర్శకులతో కిక్కిరిసిపోయింది. పలువురు భక్తులకు బాబా క్యాలెండర్లు పంపిణీ చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా భీమిలి పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆశ్రమ ట్రస్టీలు డి.రాజు కుమందస్, మహమ్మద్ అస్లాం, మహమ్మద్ సాహెబ్, వి.త్రిమూర్తి భక్తులకు భోజన, వసతి సదుపాయాలు సమకూర్చారు.



ఆకట్టుకున్న నేలవేషాలు

వుడా భూముల పరిశీలన



సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

మధురవాడ: విశాఖ రూరల్ మండలం మధురవాడ రెవెన్యూ గ్రామం పాత మధురవాడ సమీపంలో ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులు సోమవారం పరిశీలించారు. ఇక్కడ రెండు సర్వే నంబర్ల మధ్య హద్దులకు సంబంధించి వివాదం తలెత్తడంతో, వుడా భూముల పరిరక్షణ కోసం ఒకరు పోలీసు ఫిర్యాదు ఇచ్చారు. దీనిపై సర్వే నంబరు 1738 సంబంధించిన జిరాయితీ భూమికి, 174లో ఉన్న వుడా భూములకు మధ్య మార్కింగ్ చేశారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ ప్రసాద్, శ్రీనివాస్, వీఆర్‌వో ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

జోన్-2 పీజీఆర్ఎస్‌కు 9 వినతులు



అధికారులకు సమస్య వివరిస్తున్న వ్యక్తి

మధురవాడ: మధురవాడ జీవీఎంసీ జోన్-2 కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు తొమ్మిది వినతులు వచ్చాయి. జోనల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇంజినీరింగ్‌శాఖ ఈఈ శాంతిరాజు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఇందులో బింద్రానగర్‌లోని పార్కులో అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని జీవీఎంసీ, రెవెన్యూ,వీఎంఆర్‌డీఏశాఖల ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చినా జోనల్ అధికారులు చర్యలను ఆలస్యం చేస్తున్నారని కాలనీ వాసులు వాపోయారు.

జోన్-1 కు ఏడు దరఖాస్తులు

భీమునిపట్నం: భీమిలి జోనల్ కార్యాలయం వద్ద జెడ్సీ ప్రేమ ప్రసన్నవాణి ఆధ్వర్యంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు ఏడు వినతులు వచ్చాయి. ఇందులో ఇంజినీరింగ్ విభాగానికి అయిదు, పట్టణ ప్రణాళిక, రెవెన్యూ విభాగానికి సంబంధించి ఒక్కో వినతి వచ్చాయి. వీటిని పరిశీలించి, త్వరగా పరిష్కరిస్తామని జెడ్సీ తెలిపారు.

చిన్న శ్రీనుకు శుభాకాంక్షలు



చిన్న శ్రీనుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న యువజన విభాగం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నరేష్ తదితరులు



మజ్జి శ్రీనివాసరావును అభినందిస్తున్న రాష్ట్ర నాగవంశ సంఘం ప్రతినిధులు

మధురవాడ: వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైన మజ్జి శ్రీనివాసరావు(చిన్న శ్రీను)ను మధురవాడకు చెందిన వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి జగ్గుపిల్లి నరేష్, నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. విజయనగరంలోని ఆయన నివాసంలో కలిసిన వారు ఆయనకు పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపారు. అభినందనలు తెలిపిన వారిలో వై.రాజాం నాయుడు, భోగవిల్లి అశోక్‌కుమార్, పి.సురేష్‌వర్మ, నాగోతి రాజు, వాండ్రాసి వినోద్ తదితరులున్నారు.

నాగవంశ ప్రతినిధుల అభినందన

తగరపువలస: వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావును రాష్ట్ర నాగవంశ సంఘం ప్రతినిధులు సోమవారం విజయనగరంలో కలిసి అభినందనలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాగవంశ సంఘం అనుబంధ విభాగం అధ్యక్షుడు బొడ్డు అప్పలనాయుడు ఆధ్వర్యంలో భీమిలి వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, భీమిలి ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు బోని అప్పలనాయుడు, నాయకులు కలిశారు.

నేటి నుంచి ఆలయ వార్షిక వేడుకలు

తగరపువలస: ఆనందపురం మండలం లొడగలవానిపాలెం శ్రీఅభయ ఆంజనేయస్వామి ఆలయ 18వ వార్షిక వేడుకలు మంగళ, బుధవారాలలో జరగనున్నాయి. ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం బుధవారం మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భారీ అన్నసమారాధన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

విజేతలకు బహుమతుల పంపిణీ



బహుమతులతో విజేతలు

పద్మనాభం: రేవిడిలో నెహ్రూ యువకేంద్ర ఆధ్వర్యంలో రెండు రోజులు నిర్వహించిన భీమిలి నియోజకవర్గ స్థాయి క్రీడా టోర్నమెంటులో విజేతలకు సోమవారం బహుమతులు పంపిణీ చేశారు. కబడ్డీలో ప్రథమ స్థానంలో నిలిచిన రౌతులపాలెం, ద్వితీయ స్థానంలో నిలిచిన బర్లపేట, వాలీబాల్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన రేవిడి, ద్వితీయ స్థానంలో నిలిచిన వెంకటాపురం టీమ్‌లకు షీల్డ్‌లు, ప్రశంసా పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్‌వైకే సభ్యుడు టి.మధు, శ్రీ శ్రీనివాసా సేవా సంఘం అధ్యక్షుడు కె.సన్యాసినాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు కోన రమణ, టీడీపీ నాయకుడు కెల్ల సురేష్ పాల్గొన్నారు.

భీమిలి హైస్కూల్లో క్రీడా పోటీలు



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు సూర్యనారాయణ

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరగనున్న శతాబ్ది ఉత్సవాలకు సంబంధించి విద్యార్థులకు సోమవారం క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ఇందులో కబడ్డీ పోటీలను ఉత్సవ్ నోడల్ అధికారి సోమేశ్వరరావు, వాలీబాల్ పోటీలను ఉత్సవ్ కమిటీ గౌరవ అధ్యక్షుడు కలిగొట్ల సూర్యనారాయణ మూర్తి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఉత్సవాల్లో భాగంగా ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. గెలుపు, ఓటములను పట్టించుకోకుండా అందరూ క్రీడా స్ఫూర్తితో ఆడాలని కోరారు. కార్యక్రమంలో సన్ స్కూల్ డైరెక్టర్ కైతపల్లి శ్రీనివాస్, ఉత్సవ కమిటీ కార్యదర్శి మైలపల్లి లక్ష్మణరావు, కోశాధికారి పూసర్ల శ్రీనివాసరావు, సభ్యులు టీ.భీమారావు, కాళ్ల సన్నీ, మైలపల్లి షణ్ముఖరావు, కంటుభుక్త ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తత అవసరం



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఏఎస్ఐ వెంకటేశ్వరరావు

కొమ్మాది: యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా బాధ్యతగా వ్యవహరించాలని ఏఎస్ఐ బి.వెంకటేశ్వరరావు సూచించారు. ఆన్‌లైన్ మోసాలపై ఎండాడలోని యాక్ట్స్ కళాశాలలో సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే భవిష్యత్ ప్రణాళికతో ముందుకు వెళ్లాలని, అప్పుడే సమాజంలో గౌరవం ఉంటుందని అన్నారు. ర్యాగింగ్ వంటి వాటితో భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. డ్రగ్స్, ట్రాఫిక్ రూల్స్, సైబర్ క్రైం వంటి పలు విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం. పద్మారావు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటిస్తే ప్రమాదాలకు చెక్



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు

భీమునిపట్నం: ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలను పాటిస్తే ప్రమాదాలకు చెక్ పెట్టవచ్చని మోటారు వాహనాల ఇన్‌స్పెక్టర్ బుచ్చిరాజు అన్నారు. రహదారి భద్రతపై భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నిబంధనలు పాటించకపోవడం, అతి వేగం కారణంగానే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. వాహనాలను నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ద్విచక్రవాహనంపై కచ్చితంగా హెల్మెట్ ధరించి వెళ్లాలన్నారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సహదేవుడు, ఎన్ఎస్ఎస్ ప్రోగాం అధికారి డాక్టర్ అప్పలనాయుడు, విశాఖ సమన్వయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు లీలాప్రసాద్ పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్లకు ప్రభుత్వం భద్రత కల్పించాలి

భీమునిపట్నం: ప్రమాదకరమైన వృత్తిలో సేవలందిస్తున్న తమకు ప్రభుత్వం భద్రత కల్పించాలని భీమిలి పట్టణ ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కనకల సన్నిబాబు కోరారు. భీమిలి చిన్నబజారు వద్ద అసోసియేషన్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విధి నిర్వహణ సమయంలో జరిగే ప్రమాదాల్లో చాలామంది గాయపడడంతో పాటు కొందరు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. వారి కుటుంబాలకు సాయం అందించేందుకు అసోసియేషన్ ఏర్పాటు చేశామని, ప్రభుత్వం సహకరించాలని కోరారు. ముందుగా కార్యక్రమానికి విచ్చేసిన జెడ్సీ ప్రేమ ప్రసన్నవాణి, తహసీల్దారు రామారావు, ఎస్ఐ హరీష్ తదితరులు బల్బ్‌ను కనిపెట్టిన థామస్ ఆల్వా ఎడిసన్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం డివిజన్ కార్యదర్శి ఆర్.ఎస్.ఎన్. మూర్తి, అసోసియేషన్ కార్యదర్శి కె.వి.రమణ, కోశాధికారి కంటుబోతు రవి, సభ్యులు పాల్గొన్నారు.

గురుశిష్యుల బంధానికి నిదర్శనం రామాయణం

బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు



మధురవాడ: శ్రీరామాయణ మహా కావ్యం గురు శిష్యుల బంధానికి పట్టాభిషేకం చేస్తుందని ప్రవచన చక్రవర్తి, బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. గురువుకు శిష్యునిపై గల వాత్సల్యానికి, శిష్యునికి గురువుపై ఉండాల్సిన గురి, గౌరవం, నిబద్ధతను గురించి ఎంతో గొప్పగా వివరిస్తుందన్నారు. మధురవాడ గాయత్రి విద్యా పరిషత్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో శ్రీ అష్టలక్ష్మి, శ్రీవైశాఖేశ్వర స్వామి ఆలయం, గాయత్రి విద్యాపరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో సంపూర్ణ రామాయణంపై నిర్వహిస్తున్న కార్యక్రమంలో 3వ రోజు ఆయన అనుగ్రహ భాషణం చేశారు. విశ్వామిత్ర మహర్షి గొప్పదనం, దశరథ మహారాజు రామలక్ష్మణులను విశ్వామిత్రుని వెంట పంపించడం, తాటకీ సంహారం, విశ్వామిత్రుని యాగ సంరక్షణ, మారీచుని తరిమికొట్టడం, సుబాహుని సంహరించడం తదితర ఘట్టాలను వివరించారు. వశిష్ట మహర్షి రామ, లక్ష్మణ, భరత, శతృఘ్నులకు విద్యాభ్యాసం చేయించినప్పుడు వారికి కేవలం విద్య నేర్పడమే కాకుండా, తాము నేర్చుకున్న విద్యను లోక సంరక్షణకు, సమాజ ప్రయోజనానికి ఎలా ఉపయోగించాలో నేర్పించారన్నారు. అందువల్లనే వారు అంత గొప్ప శ్రీమంతులయ్యారన్నారు. ఇటువంటి సంయమనం, విలువలతో కూడిన విద్యాభ్యాసం ఎప్పటికీ ఆదర్శప్రాయంగా నిలుస్తుందని చెప్పారు. ప్రతి మనిషి జీవితంలో గురువు అత్యంత ప్రధాన పాత్ర పోషిస్తారన్నారు. కార్యక్రమానికి భక్తులు విశేషంగా వచ్చారు. నిర్వాహకులు అష్టలక్ష్మీ దేవాలయం ధర్మకర్త అన్నంరాజు సత్యనారాయణమూర్తి దంపతులు, గాయత్రి కార్యదర్శి ప్రొఫెసర్ సోమరాజు పాల్గొన్నారు.

త్రైతసిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



ప్రచారం చేస్తున్న త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రతినిధులు

తగరపువలస: త్రైత సిద్ధాంత భగవద్గీత కర్త, ఇందూ జ్ఞాన ప్రధాన ఆచార్య ప్రబోధానందుడి రచనలను విజయరాంపురం కమిటీ ప్రతినిధులు సోమవారం ఆనందపురం మండలంలో ఇంటింటా ప్రచారం చేశారు. నీళ్లకుండీలు, దబ్బంద గ్రామాల్లో జరిగిన ప్రచార కార్యక్రమంలో భాగంగా ప్రబోధానందుడు రచనలలోని నిగూఢ తత్వార్థ బోధిని అనే గ్రంథంలో వేమన భగవాన్ గురించి తెలియజేశారు. ప్రచార కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథరావు, వి.సురేష్, ఎస్.శ్రీనివాసరావు, కె.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో విజేతకు అభినందన



లక్ష్మి సాత్వికన్‌ను అభినందిస్తున్న పాఠశాల ప్రతినిధులు

భీమునిపట్నం: గణతంత్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వీర గాథ చిత్రలేఖనం పోటీల్లో సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఏడో తరగతి విద్యార్థి మెరుపుల లక్ష్మిసాత్విక్ ప్రతిభ కనబరిచాడు. విశాఖలో మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్, భారత ప్రభుత్వం సహకారంతో సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో భగత్ సింగ్ చిత్రపటాన్ని గీసిన సాత్విక్ మండల స్థాయిలో విజేతగా నిలిచాడు. ఈ సందర్భంగా సాత్వికన్‌ను పాఠశాల వద్ద కరస్పాండెంట్ సిస్టర్ త్రిషామేరీ, ప్రిన్సిపాల్ సిస్టర్ క్రిస్టిజాన్, ఉపాధ్యాయులు అభినందించారు.

జోన్-2 టౌన్ ప్లానింగ్‌కు సిబ్బంది కొరత

నామమాత్రంగా అక్రమ కట్టడాల నియంత్రణ



మధురవాడలో అనధికార నిర్మాణానికి ధ్వంసం చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

మధురవాడ: జీవీఎంసీలో ప్రభుత్వానికి ఎక్కువ ఆదాయం తెచ్చిపెడుతున్న జోన్లలో ప్రధానమైనది జోన్-2 మధురవాడ ప్రాంతం. అలాగే నిబంధనలకు విరుద్ధంగా, అనధికార నిర్మాణాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతం కూడా ఇదే. అయినా ఇంతటి ముఖ్యమైన ప్రాంతంలో అక్రమ నిర్మాణాలను నియంత్రించాల్సి టౌన్ ప్లానింగ్ విభాగాన్ని సిబ్బంది కొరత పీడిస్తోంది. స్క్వాడ్ సిబ్బంది, వాహనాల కొరత, అధికారుల కొరతతో సతమతమవుతోంది. సాధారణంగా స్క్వాడ్ సిబ్బంది 6గురు, ఒక వాహనంతో పాటు జేసీబీ వంటివి ఉండాలి. పైగా ఇక్కడ గతంలో ఒక్కో వార్డుకు ఒక బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్, ఇద్దరు టీపీఎస్‌లు ఉండేవారు. కానీ ప్రస్తుతం అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ)తో పాటు టీపీబీవో మాత్రమే ఉన్నారు. ప్లానింగ్ సెక్రటరీలకు అదనపు బాధ్యతలు అప్పగించి బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ల పనులు చేయిస్తున్నారు. దీంతో ఈ పనులు సక్రమంగా సాగడం లేదు. వీరిని అత్యధికులు ప్రభావితం చేస్తున్నారు.

నామమాత్రంగా ఆక్రమణల తొలగింపు

సిబ్బంది కొరత, అధికారులు లేకపోవడంతో ఇక్కడ టౌన్ ప్లానింగ్ ఉన్నతాధికారులు ప్రైవేటు సిబ్బందిని ఉపయోగించి ఈ పనులు చేయించుకుంటున్నారు. పైగా పనులకు కార్పొరేషన్ నుంచి నిధులు రాకపోవడంతో సొంత డబ్బులు పెట్టి పనులు చేయిస్తున్నారు. దీంతో ఆక్రమణల తొలగింపు పనులు కూడా నామమాత్రంగానే చేపడుతున్నారన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. దీనిపై ఏసీపీ తిరుపతి రావు వివరణ కోరగా స్క్వాడ్ సిబ్బంది త్వరలో వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం ఆక్రమణల తొలగింపు పనులకు ఇబ్బందులు లేవన్నారు.